


# పరిష్కారం

"ధైర్యానికి నిజంగా పిరికితనమనే అర్థం-కాదంటే దానిని మూర్ఖత్వం అనా"లని సిద్ధాంతీకరించాడు మా నరసింహం.

"ఈ సిద్ధాంతాలతో మమ్మల్ని చంపకు. నీకు పుణ్యం ఉంటుంది. సంగతి ఏమిటో చెప్పు; చేతనైన విధంగా మేమే దానిని అర్థం చేసుకొంటా"మని నలుగురము ముక్త కంఠంతో ప్రార్థించాము.

నరసింహం హృదయం కరిగింది.

అతడు చెప్పినది ఇది:

"వేసవి సెలవులకు మా తాతగారి ఊరికి వెళ్ళాను. ఊళ్ళో పరిస్థితి ఏమీ బాగుండలేదు.

"తాతగారి ఊరిచివర ఒక చెరువు ఉంది. ఆ చెరువులో చేపలు పట్టడం గురించి రాజులకు రాజులకు తగాయిదా ఏర్పడింది. కొట్లాటలు సాగుతున్నవి. ఉద్రిక్తమైన వాతావరణం నెలకొన్నది. ఈ కొట్లాటలకు ఊళ్ళో ఉన్న అహింసావాదులు అంతా భీతిచెంది ఉన్నారు. రాత్రులు ఏమిటి, పగళ్ళుకూడా వీధిలో అడుగుపెట్టడానికి భయపడుతున్నారు. పెద్ద పెద్ద మగవాళ్ళే. ఇక ఆడవాళ్ళమాట చెప్పనక్కరలేదు.

"నేను మామూలుగా ఊళ్ళో షికారులకు బయలుదేరబోతే అమ్మమ్మ నన్ను కదలనిచ్చింది కాదు. 'బ్రతికి ఉంటే బలుసాకు అయినా తినవచ్చు. నిష్కారణంగా ప్రాణానికి మొప్పం తెచ్చుకోకు. ఇల్లువిడిచి కదిలావంటే నన్ను చంపుకు తిన్నట్టే. నా తండ్రీ, ఇంట్లో కూర్చుని చదువుకో నాయనా' అని బ్రతిమాలుకొంది. అమ్మమ్మను ఏడిపించడం ఇష్టంలేక కారాగారవాసం ప్రారంభించాను. అది కారాగారవాసం కన్న నికృష్టం అనుకోండి. పైగా నా వీరత్వం గురించి అమ్మమ్మకు నమ్మకం అణుమాత్రమైనా లేకపోవడంతో అభిమానమూ దెబ్బతిన్నది. ఇది నా సంగతి కాదు కనుక అంతటితో నా సోది సరిపెట్టుతాను లెండి.

"ఆ గ్రామంమీద క్షత్రియులదే ఆధిపత్యం. క్షత్రియుల ఘనతే అది. ఎక్కడన్నా ఉండనివ్వండి, ఆధిపత్యం మాత్రం తామే వహించాలంటారు.

"మా తాతగారి ఊరిలో ఉన్నవే రెండు క్షత్రియ కుటుంబాలు. ఉభయకుటుంబాలవారూ మోతుబరులే.

"ఇంకేమి? కక్షలకు - కావేషాలకు, తగాయిదాలకు-కొట్లాటలకు కావలసిన సరంజామా అంతా ఉన్నదన్న మాట.

"పాపం! క్షత్రియులు ఎవరికీ శత్రువులు కారు. కేవలం తమకు తామే శత్రువులు. మొదటినుంచి అలాగే కదా! ఇద్దరు ఉంటే ఎవరు గొప్పవారో తేల్చుకోవాలి. లేకపోతే పౌరుషం ఎలా నిలబడుతుంది?

"ఎక్కడ అయినా సరే ఎంతమంది క్షత్రియులు ఉంటే అన్ని పార్టీలు. మా తాతగారి ఊళ్ళోనూ అంతే.

"చేపలుపట్టే తగాయిదాలో న్యాయం ఎవరిది అన్న మీమాంసతో మనకు నిమిత్తం లేదు. మా తాతగారి ఊళ్ళోనూ అప్పుడు ఎవరికీ నిమిత్తం లేదు. ఎవరిపార్టీ అన్నది ఒక్కటే ప్రశ్న. తటస్థులు ఉభయపక్షాలవారికీ శత్రువులే. అందుచేత వారికి స్థానం లేదు.

"స్థూలంగా వివరిస్తాను. తాతగారి ఊళ్ళో ఒకటి సుబ్బరాజుగారి పార్టీ; రెండవది లక్ష్మీపతిరాజుగారి పక్షం.

"సుబ్బరాజుగారు, లక్ష్మీపతి రాజుగారు కూడా ధర్మ బుద్ధి కలవారు. యోగ్యులు. స్నేహపాత్రులు. గౌరవ నీయులు. అన్ని సుగుణాలూ ఉన్నవి. ఏమైతే నేమి? ఒండొరుల పొడ కిట్టదు వారికి. పేరు వింటే చాలు మండిపడతారు. వారిలో ఎక్కడో అణగి మణగి వున్న రాక్షసత్వం అంతా విజృంభిస్తుంది.

"ఆ బలవంతుల కొట్లాటలతో, కక్షలతో గ్రామంలో వాతావరణం కలుషితమై పోయింది.

"ఇది ఇలా వుండగా పానకంలో పుడకలా నరసింహమూర్తి రంగంలో దిగాడు. నరసింహమూర్తి సుక్షత్రియుల బిడ్డ. పూర్తి పేరు వీరనరసింహమూర్తిరాజు. మనిషిని చూస్తే ఎవరూ అతనిని వీరుడనుకోనలేరు. నృసింహస్వామి అపరావతారమని అసలు భ్రమించరు.

"నరసింహమూర్తి సన్నగా శలాకలా ఉంటాడు. గట్టిగా గాలి వీస్తే పడిపోతాడేమో అనిపిస్తుంది. పరమ శాంతుడు. ఒకరి జోలికి శొంఠికి పోయేరకం కాదు. ఒకరితో అధికంగా మాట్లాడికూడా ఎరగడు.

"నరసింహమూర్తిది ఆ ఊరు కాదు. ఆ ఊళ్ళో రాజులు ఎవరితోనూ బాంధవ్యమూ లేదు.

"తాతగారి ఊళ్ళో ప్రతి శనివారం పశువుల సంత జరుగుతుంది. ఎన్నికైన పశువులు వస్తూ ఉంటవి.

"ఎడ్ల జత కొనడానికి వచ్చాడు నరసింహమూర్తి రాజు.

"వచ్చేటప్పుడు క్షత్రియ కుల ధర్మానుసారం ఒక తైనాతీని వెంటబెట్టుకొని మరీ వచ్చాడు నరసింహమూర్తి. క్షత్రియులకు తోడు అవశ్యం కదా! తైనాతీగా వచ్చినవాడు లక్ష్మణుడు.

"తాతగారి ఇల్లు సంతకు దగ్గర. ప్రతి శనివారం బోలెడుమంది తాతగారి ఇంట్లో తాత్కాలిక నివాసం

ఏర్పరచుకొంటూ ఉంటారు. ధర్మసత్రంగా ప్రసిద్ధి చెందినది తాతగారి పూరిల్లు.

"లక్ష్మణ ద్వితీయుడైన నరసింహమూర్తి కూడా తాతగారి ఇంట్లోనే చేతి సంచి ఉంచి సంతకు వెళ్ళాడు.

"ఆ సాయంకాలం సంత అయిపోయింది. మకాం పెట్టుకొన్న అందరూ వచ్చి మూటా ముల్లె చంకబెట్టుకొని వెళ్ళిపోయారు. లక్ష్మణ ద్వితీయుడైన నరసింహమూర్తి మాత్రం రాలేదు. ఆ రాత్రికి ఊళ్ళో ఉండి పోతామనీ చెప్పి పోలేదు. అయినా అతిథి మర్యాదకు ఎక్కడ లోటు వస్తుందోనని రాత్రి భోజన కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా వేశాడు తాతయ్య. వీధి అరుగుమీద కనిపెట్టుకొని కూర్చున్నాము. మా కో అనుమానమూ ఉంది – ఊరివారి కొట్లాటల్లో ఈ పరాయి రాచబిడ్డ చిక్కుకొన్నాడేమోనని.

"ఎనిమిది గంటల వేళ లక్ష్మణుడు ఎక్కడనుంచో రొప్పుకుంటూ పరుగున వచ్చి చీడీల దగ్గర పడిపోయాడు. 'మా రాజుగారిని దేవాలయం దగ్గర ఎవరో కొట్టి చంపుతున్నారంటోయ్. ఎవరినైనా మగాళ్ళను పంపి రక్షించా'లని గోలపెట్టాడు.

"ఇంటివద్ద పాలేరు కూడా లేదు. 'ఆ చుట్టుప్రక్కల దగ్గరలో కొంపలు లేవు. తాతగారి ఇల్లు కొబ్బరితోటకు ఆనుకొని ఉంది. ఉపేక్ష చేయడానికి వీలులేదు. వృద్ధుడు అయినా తాతయ్య బయలుదేరాడు. చిన్నప్పుడు నేను కూడా తోడి రాచబిడ్డలతో కలిసి బాణాకర్ర తిప్పి ఉన్నాను. కర్ర చంకబెట్టు

కొని తాతయ్యను అనుసరించాను. లక్ష్మణుడు మాత్రం ఇల్లు విడిచి రావడానికి అంగీకరించలేదు. భయంతో ఒకటే వణికి పోతున్నాడు.

"దేవాలయం చుట్టూ వెదికాము. ఉత్తరం వైపు ప్రహరీగోడ దగ్గర చిన్న యుద్ధం జరుగుతున్నది. పున్నమి వెన్నెల ఏమో స్పష్టంగా కనుపిస్తున్నది.

"నరసింహమూర్తిరాజు గోడ ఆనుకొని నిలబడి కఱ్ఱ తిప్పుతూ ఆత్మరక్షణ చేసుకొంటున్నాడు. నలుగురు ముష్కరులు ఆతనితో కఱ్ఱతో పోరాడుతున్నారు. ఒకని చేతిలో కత్తి కూడా కనుపించినది.

"నేను ఆవేశపడి ముందుకు ఉరకబోయానని చెప్పలేను. కాని ఒంటరిగా, ధైర్యంగా, నిర్మానుష్యమైన ప్రదేశంలో నలుగురిని ఎదుర్కొన్న ఆ యువకునికి తోడ్పడాలని మాత్రం అనిపించింది - ఏమైనా సరే అని.

"నాకు అర్థం కానిది మా తాతయ్య అర్థం చేసుకొన్నాడు. ఆ ఒంటరివాడిదే యుద్ధంలో పైచేయి అని ఎలా అర్థం చేసుకొన్నాడో నాకు ఈనాటికీ బోధపడదు. ముందుకు వెళ్ళవద్దని సంజ్ఞచేసి నన్ను వారించాడు.

"పది నిమిషాల్లో పోరాటం సమాప్తమైనది. నలుగురు ముష్కరులూ తలలు బ్రద్దలై క్రిందపడ్డారు. నరసింహమూర్తిని విజయం వరించినది.

"ఆ తరువాత నరసింహమూర్తి సూత్రప్రాయంగా చెప్పినదానినిబట్టి మేము తెలుసుకొన్నది ఇది: సంతకు వచ్చిన

జతల్లో చాలామట్టుకు నరసింహమూర్తికి నచ్చలేదు. నచ్చిన వాటికి బేరం కుదరలేదు.

"సాయంత్రం అయింది. సంత అయిపోయింది. దగ్గరలో దేవాలయం కనుపిస్తే దేవుని దర్శనం చేసుకోవాలనుకొన్నాడు నరసింహమూర్తి. లక్ష్మణుని వెంటబెట్టుకొని అక్కడికి వెళ్ళాడు.

"గ్రామస్థులకు తగాయిదాలతో తీరిక లేకుండా పోయిన కారణంచేత సాధారణంగా ఆలయంవద్ద మనుషులు ఉండరు. చీకటిపడడం తడవుగా పూజారులు తలుపులు మూసివేసి ఇళ్ళకు జారుకొంటారు.

"ఆలయం మూసి ఉండగా చూచి నిరుత్సాహపడ్డాడు నరసింహమూర్తి. కోనేరులో స్నానం చేశాడు. విశ్రాంతి తీసుకొనడానికి ఒడ్డున కూర్చున్నాడు.

"నరసింహమూర్తి సంతలో తిరుగుతూ ఉండగా అతనివద్ద అధికంగా డబ్బు ఉన్న సంగతి పసిగట్టిన దుండగులు అతని వెన్నంటి ఉన్నారు. ఇది నరసింహమూర్తి కూడా పసిగట్టాడు. కాని సంతలో దౌర్జన్యానికి పూనుకొంటారని అనుమానించలేదు. సాయంకాలం అయ్యేసరికి ఈ సంగతి మరిచిపోయాడు.

"కోనేరుగట్టున ఉన్న నరసింహమూర్తిని, లక్ష్మణుని దుర్మార్గులు చుట్టుముట్టారు. వారి వాలకం చూచి భయపడ్డాడు లక్ష్మణుడు. మా అమ్మమ్మలాంటివాడు. నరసింహమూర్తి వీరత్వంమీద నమ్మకం లేదు. కనుక పలాయన

మంత్రం పఠించాడు. ఆ సంఘటనలో లక్ష్మణుని పాత్ర అంత మాత్రమే.

"దుండగులు నాలుగువైపులా చుట్టుముట్టితే ప్రాణానికి ముప్పమని గుర్తించాడు నరసింహమూర్తి. వెనుకభాగం రక్షించుకొనడానికి మొదట ప్రయత్నించాడు.

"నేర్పుగా ఆ నలుగురిని తప్పించుకొని ఆలయం గోడ చేరుకొని దానిని ఆనుకొన్నాడు. మొలలోనుంచి కైజారు తీశాడు. ఒకచేతితో తుండుగుడ్డ పట్టుకొన్నాడు. దుండగుల కర్రదెబ్బలు అడ్డుకొనడానికి డాలు అయింది ఆ తుండుగుడ్డ. కుడిచేత కైజారు. పోరాటం చాలాసేపే సాగింది. నిమిషంలో అయిపోవలసిన పని ఎంతసేపటికీ సాగకపోయేసరికి దుండగులు సాహసించారు. సమయం చూచి ఒడుపుగా ఒకని చేతికర్ర పట్టి చేజిక్కించుకొన్నాడు నరసింహమూర్తి. అంతలో మేము అక్కడికి చేరాము.

"ఆ తరువాత ఒక్కొక్కరి తల బ్రద్దలుకొట్టి చిత్తు చేశాడు దుండగులను నరసింహమూర్తి.

"మా తాతయ్యతో అన్నాడుకదా—'నేను చేయు గలిగిన పనికి ఒకరి సహాయం ఎప్పుడూ కోరలేదు. ఎవరైనా తమంతట తాముగా జోక్యం చేసుకొంటే సహించనూ లేదు. మీ అబ్బాయిగారు (నేను అన్నమాట) ఎక్కడ కలుగజేసు కొంటారో అని అనుమానపడి త్వరగా ముగించాను. కోపమూ వచ్చింది నాకు. మన్నించండి' – అని.

"మా తాతయ్యను మెచ్చుకొనకుండా ఉండలేక పోయాను.

“ఇలా కబుర్లు చెప్పుకొంటూ ఇంటికి చేరుకొన్నాము. రాత్రికి రాత్రి వెళ్ళిపోదామన్నాడు నరసింహమూర్తి. ససేమిరా కదలనన్నాడు లక్ష్మణుడు. అందుచేత ఇద్దరూ ఆ రాత్రికి మా ఇంటిలో ఉండిపోయారు.

“ఇదంతా ముందు జరగబోయేదానికి నాంది ప్రస్తావనమాత్రమే అని మాకు ఎలా తెలుస్తుంది?

“తెల్లవారింది. నరసింహమూర్తి, లక్ష్మణుడు స్నానం ముగించుకొని ప్రయాణమైనారు.

“లక్ష్మణుడు పెరట్లో అమ్మమ్మకు ధన్యవాదాలు చెబుతున్నాడు. నరసింహమూర్తి వీధిలో నిలబడివున్నాడు. తాతయ్య, నేను అరుగుమీద ఉన్నాము. అంతలో పెద్ద కోలాహలం వినిపించింది.

“ఇరవై ముప్పైమంది జమాజెట్టీల్లాంటి మనుషులు కర్రలతో మా వీధిలో నేల ఈనినట్లు ప్రత్యక్షమై ఇల్లు చుట్టుముట్టారు.

“ఒక కోరమీసాలవాడు—నిప్పులు చెరిగే కనుగ్రుడ్లవాడు—ఆ గుంపు నాయకుడు కాబోలు—నరసింహమూర్తిని అదిలించి ‘నువ్వేనా రాత్రి కోనేరుదగ్గర మా మనుషులను కొట్టింది’ అని గద్దించి అడిగాడు. ‘వాళ్లు మీ మనుషులు అవునో కాదో తెలియదు కాని, కొట్టింది నేనే’ అన్నాడు నరసింహమూర్తి.

“అంతే. జనం విరుచుకొని నరసింహమూర్తిమీద పడిపోయారు. కర్రలతో కొట్టి ఒళ్లు హూనంచేశారు.

నరసింహమూర్తి స్మృతితప్పి పడిపోయేవరకు కొట్టుతూనే ఉన్నారు. తరువాత కూడా బాదినారు.

"స్మృతితప్పి పడిపోయేవరకు లేచి నిలబడి ఎదిరించి పోరాడడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు ఆ మహావీరుడు. లాభం లేకపోయింది. ఒక్కడు అయిపోయాడు.

"ఇద్దరు వస్తాదులు మా తాతయ్యను, నన్ను పట్టుకొని ఒకమూల నిలబెట్టారు. మా తాతయ్య కేకలను వారు లక్ష్య పెట్టలేదు. ఆ మహాదారుణమైన దృశ్యాన్ని చూడడం మాకు తప్పలేదు. నామట్టుకు నేను భగవంతుని నిందించుకొంటూ కళ్లు మూసుకొని గోడకి చేరగిలబడి ఉన్నాను.

"పడిపోయి ఉన్న మనిషిని చూచి, చచ్చాడని నిశ్చయించారు ఆ పెద్ద మనుషులు. అయినా కొనవూపిరి ఎక్కడైనా ఉన్నదనుకొన్నారు కాబోలు. అతనివంక చూచి 'మేము మళ్ళీ అరగంటలో ఇక్కడికి వస్తాము. వచ్చేసరికి ఊరి పొలిమేర దాటిపోలేదో—చంపేస్తాము. ఖబర్దార్' అని అరిచాడు నాయకుడు అయిన మిడిగ్రుడ్లవాడు. కోనేరుదిశగా వెళ్ళిపోయారు.

"నరసింహమూర్తిని కొట్టుతూ ఉన్నంతసేపూ ఆ జనం వేసిన కేకలుబట్టి మేము అర్థంచేసుకొన్నది ఇది:

"క్రిందటి సాయంకాలం కోనేరువద్ద నరసింహమూర్తి గారిచేత దెబ్బలు తిన్నవారిలో లక్ష్మీపతిరాజుగారి మనుష్యులు ఉన్నారట. వారు లక్ష్మీపతిరాజుగారిని రాత్రికి రాత్రి కలుసు

ఈ అవమానం తుడిచి వేసుకొంటే కాని కాలు కదప నన్నాడు.

"నా బాణాకర్ర - నక్క-పిలికర్ర - తెచ్చి ఇచ్చాను.

"అంతలో లక్ష్మీపతిరాజుగారి మనుషులు అక్కడికి తిరిగి వచ్చేశారు. నరసింహమూర్తి ఇంకా అక్కడే ఉండడం, చేతిలో బాణాకర్ర ఉండడం చూచి ఉగ్రులైపోయారు.

"ఈసారి నరసింహమూర్తి వారి కేకలకు బదులు చెప్పలేదు. బాణాకర్ర తిప్పుతూ అరుగుమీదనుంచి ఆ గుంపు లోనికి హనుమంతుడులా దుమికినాడు. ఒక్క ఊపులో మనుషు లను చెదరగొట్టి చుట్టూ ఖాళీచేసుకొన్నాడు. ఆతడు పన్నిన వ్యూహం అలాంటిది. చుట్టూ ఆరుగురికన్న ఏకకాలంలో అందుబాటులో ఉండలేరు. చిత్రవిచిత్రమైన విన్యాసాలు, లాఘవం ప్రదర్శించాడు. దెబ్బ మీదపడకుండా ఆత్మరక్షణ చేసుకొంటూ దెబ్బ దెబ్బకు ఒక్కొక్క తల బ్రద్దలుచేస్తూ వీరవిహారం చేశాడు. అరగంట దాటకుండా యుద్ధం ముగిసి పోయింది. ఇరవైమంది అయినా తలలు బ్రద్దలై నేల కూలి నారు. తతిమ్మావారు వెనుకకు తిరిగి చూడకుండా పారి పోయారు.

"నరసింహమూర్తి విజయం సాధించాడు.

"మా తాతయ్య కానుకగా సమర్పించిన (నా) బాణా కర్ర చంకను పెట్టుకుని తైనాతీ వెంటరాగా మరో పదినిమిషా లకు అల్లా ఆ గ్రామం పొలిమేరదాటి వెళ్ళిపోయాడు.

కుని సుబ్బరాజుగారు ఎక్కడినుంచో ఒక మహావీరుని తన తరఫున పోరాడడానికి రప్పించారని, అతడు అన్యాయంగా, అక్రమంగా తమను పట్టుకొని కొట్టాడని చెప్పుకొన్నారట. ఆరా తీయగా ఆ మహావీరుడు ఎక్కడ ఉన్నాడో తెలిసింది. ఇంకేమి? లక్ష్మీపతిరాజుగారు తనబలం అంతా సేకరించి మా ఇంటికి పంపారు. సైనికులు చేరుకోనడానికి ఆలస్యం అయింది గాని లేకపోతే ఆరాత్రే నరసింహమూర్తికి ఆ పరాభవం జరిగి ఉండేదట.

"ఆ నికృష్టులు మమ్మల్ని విడుదలచేయగానే నరసింహమూర్తిని ఎత్తుకొనివచ్చి అరుగుమీద పరుండబెట్టాము. ఒళ్లు అంతా హూనం అయివున్నది. అదృష్టవశాత్తూ నాడి కొట్టుకుంటున్నది. అతనిని పొలిమేర దాటించడం ఎల్లాగా అని మథనపడడం ప్రారంభించాము తాతయ్య, నేను. లక్ష్మణుడు ఒకమూల చేరి వణుకుతూ ఉన్నాడు. అమ్మమ్మ ఇన్ని నీళ్లు తెచ్చి నరసింహమూర్తి నోటిలో పోసింది.

"పదినిమిషాలకు అల్లా కళ్ళు తెరిచాడు నరసింహమూర్తి. మరో అయిదునిమిషాలలో లేచి కూర్చున్నాడు. ఒళ్ళు అంతా తడిమి చూచుకొన్నాడు. ఎముకలు విరగలేదని నిర్ధారణ చేసుకొన్నాడు. మరికొంత నీరు త్రాగాడు. సేద దీరాడు. మరో పదినిమిషాల్లో లేచి నిలబడ్డాడు. మా తాతయ్య, అమ్మమ్మ చెప్పిన మాటలు ఏమీ వినిపించుకోలేదు. 'కేవలం ఒక్క ఉపకారం చేయండి. బాణాకర్ర ఉంటే ఇప్పించండి' అని మా తాతయ్యను కోరినాడు.

“చిత్రమైన పరిణామం ఏమంటే మా తాతగారి గ్రామంలో చేపల వేట తగాయిదా ఆ వేళతో పరిష్కారమై పోయింది.

“ఒక్క దెబ్బఅయినా తీయకుండా సుబ్బరాజుగారి పక్షం గెలిచింది. లక్ష్మీపతిరాజుగారి పార్టీ వీగిపోయింది. గ్రామంమీాది ఆధిపత్యం సుబ్బరాజుగారికే లభించినది.

“తాతగారి గ్రామంలో మళ్ళీ మామూలు వాతావరణం నెలకొన్నది.

“ఇంతకూ చెప్పవచ్చేదేమంటే నరసింహమూర్తి నిజంగా ధైర్యం ఉన్న మనిషికాదు. అవమానానికి భయపడిన పిరికివాడు. వేరొకవిధంగా చెప్పాలంటే శుద్ధమూర్ఖుడుఅయినా అయివుండా”లంటూ ముగించాడు మా నరసింహం.

మేము కాదనికాని, అవునని కాని చెప్పలేకపోయాము.

---